క్లుప్తంగా

25న అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ఈనెల 25న అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు అభిషేకం, 7 గంటలకు హారతి, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాదం, రాత్రి 7 గంటలకు పడిపూజ, 8 గంటలకు హరివరాసనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

సీటీవోను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

బోథ్: జిల్లా వాణిజ్య పన్నుల అధికారి మోహన్‌ను బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో ఆర్థిక పన్నుల విషయంలో సహకరించాలని కోరారు. పలు విషయాలను చర్చించినట్లు తెలిపారు. కాగా బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని సీటీవో తెలిపినట్లు చైర్మన్ పేర్కొన్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా



విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్టు

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామ సమీపంలో విద్యుత్ తీగలపై చెట్టు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గ్రామ సమీపంలో 11కేవీ విద్యుత్ లైన్ తీగలపై చెట్టు విరిగి పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. అంతర్గాంతో పాటు గొముత్రి, కరంజి, గుబిడి, కరన్‌వాడీ గ్రామాలకు విద్యుత్ సరఫరా రెండు గంటల పాటు నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఏఈ శ్రావణ్ కుమార్ సిబ్బందితో కలిసి వెంటనే విరిగిపడిన చెట్టును తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ముందస్తు హోలీ వేడుకలు



హోలీ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

బోథ్: మండలంలోని కనుగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సొనాలలోని వివేకానంద పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ సహజ రంగులు వాడాలని విద్యార్థులు తెలిపారు. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకొని సందడిగా గడిపారు. కార్యక్రమంలో కనుగుట్టలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చిలక సతీష్, సొనాలలో ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, డైరెక్టర్ కొస్మెట్టి శుద్ధోధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలు బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించారు. నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన అశోక్ గౌడ్, గంగారెడ్డిలు ఇటీవలే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసాలకు వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ఎంపీపీ రాథోడ్ సజన్, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ఎంపీటీసీలు పండరి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, లక్ష్మణ్, సురేందర్, ప్రతాప్, సర్పంచ్ మహేందర్ ఉన్నారు.

వాహనాల తనిఖీ



ఎంపీపీ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని చెక్‌పోస్టు కొత్తగూడ వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అధిక నగదు, మద్యం తరలకుండా చర్యలు చేపట్టారు. శనివారం ఘన్‌పూర్ గ్రామం నుంచి ఉట్నూర్‌వైపు వెళ్తున్న ఉట్నూర్ ఎంపీపీ జైవంత్ రావు వాహనాన్ని చెక్‌పోస్టు వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనాన్ని తనిఖీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వాహనాల తనిఖీల్లో పోలీసులకు, అధికారులకు వాహనదారులు సహకరించాలన్నారు.

వేధిస్తే కఠిన చర్యలు

బజార్‌హత్నూర్: అమ్మాయిలను, మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని షీటీం సభ్యురాలు సుశీల హెచ్చరించారు. శనివారం మండలంలోని పిప్రి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర సమయాల్లో 1930, 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్, షీటీం సభ్యుడు సత్య మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి పరీక్షలు జరిగేనా?

- గతంలో నామ మాత్రంగానే నీటి పరీక్షలు
- కొన్ని జీపీల్లో కిట్లు కూడా ఓపెన్ చేయని వైనం
- జీపీకి ఒకటి క్లోరోస్కోప్ కిట్ పంపిణీ



నీటిని పరీక్షించే క్లోరోస్కోప్ కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: కలుషిత నీటితోనే తాగి ప్రజలు ఎక్కువగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. దీంతో ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని గత కొన్నేళ్ల నుంచి సరఫరా చేస్తోంది. మిషన్ భగీరథ నీరు ముందుగా ఎస్‌ఆర్‌ఎస్పీ నుంచి మాటేగావ్‌కు చేరుకుంటుంది. అక్కడ నీటి శుద్ధి జరిగి ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండలం ఆరెపల్లికి చేరుకుంటాయి. అక్కడ నుంచి మావల మండలంలోని దేవాపూర్ చెక్‌పోస్టు వద్ద గల బ్రేక్ ప్రెజర్ ట్యాంకు (బీపీటీ)కి చేరుకుంటాయి. నీటి సరఫరా క్రమంలో మధ్యలో ఎక్కడైనా పైపు లీకేజీలు జరిగి నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఆయా ప్రాంతాల నుంచి గ్రామాల్లోని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్‌ఎస్‌ఆర్)లోకి వస్తాయి. ఓహెచ్‌ఆర్‌ఎస్‌లోకి చేరుకున్న అనంతరం 10వేల లీటర్ల తాగునీటికి 40 గ్రాముల బ్లీచింగ్ పౌడర్ వేసి క్లోరినేషన్ చేయాలి. అనంతరం ట్యాబ్‌ల నుంచి ఇంటింటికీ కుళాయికి తాగునీటిని సరఫరా చేస్తారు.

నీటిని పరీక్ష ఇలా..

వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోతాయి. నీటి ఎద్దడి తలెత్తే అస్కారం ఉంటుంది. ప్రజలు దాహార్తిని తీర్చుకోవడానికి మిషన్ భగీరథ నీటిని వినియోగిస్తుంటారు. ఇదిలా ఉండగా గ్రామాలకు సరఫరా చేసిన నీటిని క్లోరోస్కోప్ కిట్ ద్వారా మూడు దశలలో పరీక్షించాలి. మొదటి దశలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు సమీపంలోని నీటి ట్యాబ్ వద్ద సేకరించిన 15 నుంచి 20 మిలీల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫరెంట్ గ్లాస్ ట్యూబ్ నీటిలో రెండు డ్రాప్‌ల క్లోరిస్కోప్ వేసి నీటిని పరీక్షించావాల్సి ఉంటుంది. ఆ సమయంలో 1.0 పార్ట్ ఫర్ మిలియన్ (పీపీఎం) రావాలి. రెండో దశలో గ్రామంలోని మధ్యలో పరీక్షించిన్నప్పుడు 0.5 పీపీఎం క్లోరినేషన్ ఉండాలి. మూడో దశలో గ్రామానికి చివరిలోని నీటి ట్యాబ్ వద్ద పరీక్షించిన్నప్పుడు 0.2 పీపీఎం ఉండాలి.

నీటి పరీక్ష జరిగేనా..?

గతంలో నీటిని పరీక్షించేందుకు కిట్‌లను సైతం అందజేశారు. కానీ ఎక్కువ శాతం గ్రామాల్లో కిట్‌ల ద్వారా నీటిని పరీక్ష చేయకుండా మూలపడేశారు. ప్రస్తుతం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి సమక్షంలో మల్టీపర్పస్ వర్కర్‌లు ప్రతి రోజు నీటిని పరీక్షించినంతరమే సరఫరా చేయాలి. నీటిని పరీక్ష చేసే విధానం సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఏఏ సమయల్లో పరీక్ష చేశారో? వాటికి సంబంధించి రిజిస్టార్ సైతం మెయింటెన్స్ చేయాలి. ఈసారైన నీటిని పరీక్షస్తారో? లేదో? వేచి చూడాలి.

నీటి సరఫరా ఇలా..

నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికీ రోజుకు 100 లీటర్ల తాగునీటిని అందించాలి. వీటికి ఆయా గ్రామాల్లోని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, చేతి పంపులు, వన్ హెచ్‌పీ బోరు బావి మోటార్‌ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. అధికారుల అంచనా ప్రకారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు రోజుకు 37 లక్షల లీటర్లు (3.7 మిలియన్ లీటర్), మావల మండలంలోని ప్రజలకు రోజుకు 5.80 లక్షల లీటర్లు నీరు (0.58 మిలియన్) తాగునీరు అవసరం ఉంటుంది. ఇదిలా ఉండగా.. ఆదిలాబాద్ రూరల్ మండలంలో 117 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, 314 చేతి పంపులు, 9,317 నీటి ట్యాబ్‌లు, 131 వన్ హెచ్‌పీ బోరుబావులు ఉన్నాయి. మావల మండలంలో 11 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, 37 చేతి పంపులు, 1,442 ట్యాబ్ కనెక్షన్‌లు, 19 వన్ హెచ్‌పీ విద్యుత్ మోటార్లు ఉన్నాయి.

ప్రతీ రోజు నీటిని పరీక్షించాలి

మిషన్ భగీరథ ద్వారా శుద్ధ నీటిని సరఫరా చేస్తున్నాం. ఆ నీర ఉ కలుషితమైందో? లేదో? తెలుసుకునేందుకు క్లోరోస్కోప్ కిట్‌ను పంపిణీ చేశాం. ప్రతి రోజు దీని ద్వారా నీటి పరీక్ష చేయాలి. పరీక్ష చేసే విధానంపై సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చాం.

– సతీష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆదిలాబాద్ రూరల్

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం



మాట్లాడుతున్న డీఎం కల్పన

ఆదిలాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో కీలకమైందని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన అన్నారు. ఆదిలాబాద్ బస్టాండ్‌లో శనివారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి కళాకారులు పాటలు పాడుతూ ప్రయాణికులకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎం కల్పన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతీ ఓటరు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి



ఇచ్చోడలో కవాతు చేస్తున్న పోలీసులు

ఇచ్చోడ: ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ అన్నారు. శనివారం సాయంత్రం ఇచ్చోడ సీఐ భీమేశ్‌తో కలిసి మండల కేంద్రంలో ప్రధాన విధుల గుండా కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ మద్యం, డబ్బుకు ఆస్కారం లేకుండా ఎన్నికల నిర్వహణ కోసం పోలీసుశాఖ ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

జైనథ్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని జైనథ్ సీఐ సాయినాథ్ అన్నారు. శనివారం పోలీసు బలగాలతో మండల కేంద్రంతో పాటు లక్ష్మీపూర్ గ్రామంలోని కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.

'కిర్రుం గానుగ' సందడి



సందడి చేస్తున్న చిన్నారులు

బేల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కిర్రుం గానుగ ఆటలతో శనివారం చిన్నారులు సందడి చేశారు. హోలీ పండుగ సందర్భంగా ఈ ఆటలు గ్రామాల్లో నిర్వహిస్తారు. ఒక గుటంను పాతి, దానిపై వంకర మొద్దును పెట్టి ఏర్పాటు చేసుకుంటున్నారు. చిన్నారులు వంకర మొద్దుపై ఎదురెదురుగా కూర్చొని మొద్దును తిప్పుతారు. కిర కిర మంటూ శబ్దం, గానుగలా తిరగడంతో ఈఆటకు 'కిర్రుం గానుగ'గా పేరొచ్చింది. కామదహనం రోజూ మంటల్లో కర్రలను వేస్తారు. మరుసటి రోజు హోలీ పండుగ జరుపుకుంటారు.

'మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: రానున్న పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో పట్టణంలోని ఖుర్షీద్ నగర్, కేఆర్‌కే కాలనీ, క్రాంతినగర్‌లకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాసంక్షేమం దిశగా ముందుకు సాగుతుందన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, ఆశమ్మ, ఆనంద్ రావు, గంగారెడ్డి, గడ్డం జగదీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండల కేంద్రంలో భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు, టీజీవీపీ నాయకులు, వీడీసీ అధ్యక్షుడు గట్ల గంగాధర్, సురేందర్, అల్లకొండ పోతన్న నివాళులర్పించారు.

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు శంకర్, వీరకుమార్, అనిల్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు, యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలని తెలుగు అధ్యాపకుడు కబీర్‌దాస్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో తెలంగాణ స్టూడెంట్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దీపక్ అశిపాల్, టీఎస్‌ఎఫ్ అధ్యక్షుడు రాహుల్, ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ఇఫ్తార్‌ఖాన్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, రాకేష్, మమత, అనుసూయ, నిఖిత పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

భగత్‌సింగ్ వర్ధంతిని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్, జిల్లా కన్వీనర్ ఈ.కళావతి, ఉపాధ్యక్షురాలు దీపాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి దత్తాత్రీ, శ్రీకర్, మనీష్, నవదీప్ నితిన్, రితీక్, నిఖిత పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

ఎదులాపురం: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల ఆశయాలను సాధించడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ అగ్గిమల్ల సాయిచరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పూసం సచిన్, సాయిరాం, రౌత్ కార్తీక్, గణేష్, నితేష్, సాయిల్, శివ, కార్తీక్, అఖిల్ పాల్గొన్నారు.

ఎదులాపురం: భగత్‌సింత్‌కు భారతరత్న ఇవ్వాలని, 2020 జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని యూఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆత్రం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

దేశభక్తి పెంపొందించడంలో శిశుమందిరాలు కృషి



మాట్లాడుతున్న బలరాం జాదవ్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: విద్యార్థులకు సంస్కారంతో పాటు దేశభక్తిని పెంపొందించడంలో సరస్వతీ శిశుమందిరాలు చేస్తున్న కృషి చాలా గొప్పదని రాష్ట్ర ఆధ్యాపకులు సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాల 43వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. శిశుమందిరాల్లో చదువుకున్న విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాలతో పాటు క్రమ శిక్షణ కనిపిస్తుందన్నారు. విద్యరంగాంలో వచ్చిన పోటీలో కూడా నేటికి శిశుమందిర్ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గలేదన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు చెన్నల గంగారెడ్డి, బీజేపీ నాయకులు కదం బాబారావు, హిందువాహిని జిల్లా అధ్యక్షుడు అర్యన్ మహారాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతికి నిలయాలు సరస్వతి శిశుమందిరాలు

బజార్‌హత్నూర్: సరస్వతి శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలుగా మారాయని జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో సరస్వతి శిశుమందిర్ 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నత్యం, సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ అజాడే జయశ్రీ, ఎంపీటీసీ లక్కం తిరుమల, భజన్‌లాల్, నారాయణరెడ్డి, పాఠశాల కమిటీ అధ్యక్షుడు నాగానాథ్, రాజన్న, ప్రధానోపాధ్యాయుడు వొర్ని వెంకట రమణ, మాజీ సర్పంచ్ పర్చ లావణ్య, చట్ల విలాస్, కేవల్‌సింగ్, జాంసింగ్, రమేశ్, కిరప్ప శ్రీనివాస్, మాధవ్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో శనివారం 'షహీద్ దివాస్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్రగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీరోడ్డు



గుంతలమయంగా మాంగ్రుడ్ బీటీ రోడ్డు

బేల: మండలంలోని 353బీ జాతీయ రహదారి నుంచి (పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని) మాంగ్రుడ్ గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మహేందర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

ఇచ్చోడ: మండల తుడుందెబ్బ అధ్యక్షుడు ఆత్రం మహేందర్ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో శివాజీ సేనయూత్ సభ్యులు స్థానిక బస్టాండ్ వద్ద శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శివాజీ సేన యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణంలో జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆదిలాబాద్: వేసవిలో రహదారిపై ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు సూచించారు. శనివారం ఠాకూర్ హోటల్ బస్‌స్టాండ్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీసీ లక్ష్మణ్, యూసఫ్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. బైక్ నడుపుతూ ఫోన్ మాట్లాడవద్దని, హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను నెమ్మదిగా నడపాలన్నారు. మహాలక్ష్మి పథకాన్ని గురించి వివరిస్తూ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో విలేజ్ బస్సు ఆఫీసర్ సతీష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో జిల్లా నాయకులు



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో జిల్లాకు చెందిన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం ఇటీవల రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమకమైన కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకంటి అన్వేష్ రెడ్డిని సత్కరించారు. అనంతరం రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కలిశారు.







మార్కెట్లో హోలీ సందడి

ఆదిలాబాద్: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో హోలీ సందడి నెలకొంది. మార్కెట్లో రంగులు, మాస్కులు, పిచికారీలు బూరలు అందుబాటులో ఉన్నాయి. దీంతో చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలిసి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఆదివారం కామ దహనం నిర్వహించనుండగా, సోమవారం హోలీ వేడుకలను జరుపుకునేందుకు జనం సిద్ధమయ్యారు.